REGD NO : APTEL 16144



జీవించేందుకే మనిషి తినాలి
సమాజ సంక్షేమానికి జీవించాలి
- డాక్టర్ బిఆర్ అంబేద్కర్


# జన స్వరం
పవర్
అక్షరమే ఆయుధం

www.janaswaram.com




**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ :
janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 7013030690


సంపుటి : 4 | సంచిక : 299 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 13-05-2025 | పేజీలు : 5

# ఏజెన్సీలో స్థానిక గిరిజనులకే ఉద్యోగాలు

- 100% కల్పించేందుకు కట్టుబడి ఉన్నాం
- రద్దయిన జీవో 3 పునరుద్ధరణకు చర్యలు
- సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటిస్తూనే.. అవకాశాలపై అధ్యయనం చేయండి
- గిరిజన సంక్షేమ శాఖ సమీక్షలో సీఎం ఆదేశాలు



**అమరావతి, మే 12 (జనస్వరం) :** ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో వంద శాతం కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని సీఎం చంద్రబాబు అన్నారు. సోమవారం ఆయన గిరిజన సంక్షేమశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు 2000 సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్రంలో జీవో నంబర్ 3 తెచ్చామని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు. 2020లో న్యాయ సమీక్షలో రద్దు అయిన ఆ జీవో పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, మార్గదర్శకాలు పాటిస్తూనే.. జీవో 3 పునరుద్ధరణకు అవకాశాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. 1986లో వచ్చిన జీవో ప్రకారం ఏజెన్సీలో స్థానిక గిరిజనులకు టీచర్ పోస్టుల్లో నూరు శాతం రిజర్వేషన్లు తెచ్చామని, దీనిపై న్యాయపరమైన చిక్కులు రావడంతో మళ్లీ పెరిగిన మహిళా రిజర్వేషన్ శాతాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని 2000లో జీవో 3 తెచ్చామన్నారు. దీని అమలు ద్వారా 4,626 టీచర్ ఉద్యోగాలు ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు దక్కాయన్నారు. అయితే జీవో 3పై 2002లో కొందరు కోర్టును ఆశ్రయించగా.. వివిధ స్థాయిల్లో విచారణ అనంతరం 2020లో ఆ ఉత్తర్వులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని సీఎం పేర్కొన్నారు. అయితే గత ప్రభుత్వం దీనిపై సమీక్ష పిటిషన్ వేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించిందన్నారు. దీంతో సమీక్ష పిటిషన్‌ను కూడా సుప్రీంకోర్టు కొట్టివేసిందన్నారు. దీని వలన గిరిజనులు జీవో 3 లబ్ధిని కోల్పోయారని సీఎం తెలిపారు.

**చట్టపరమైన అడ్డంకులపై అధ్యయనం :**
జీవో 3 పునరుద్ధరణ లేదా అదే తరహా న్యాయం చేస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో గిరిజనులకు హామీ ఇచ్చారు. ఆ మేరకు సమీక్షలో భాగంగా ఏజెన్సీలో ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక గిరిజనులకు వంద శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉన్న అవకాశాలు, చట్టపరంగా ఉన్న వివిధ అనుకూలతలు, అడ్డంకుల గురించి చర్చించారు. జీవో 3 పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై గిరిజనులు, సంఘాల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. గిరిజనులకు తిరిగి ఆ లబ్ధిని అందించేందుకు అవకాశాలు పరిశీలించాలన్నారు. న్యాయపరమైన అంశాలు, సుప్రీంకోర్టు తీర్పు, గిరిజన హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలను అధ్యయనం చేయాలని సూచించారు.

**సీఎం ముందు 3 ఆప్షన్లు :**
జీవో 3 పునరుద్ధరణపై ప్రస్తుతమున్న మూడు అవకాశాల గురించి అధికారులు సీఎంకు వివరించారు. మొదటి ఆప్షన్‌గా ఏజెన్సీ ప్రాంతాల్లో వంద శాతం రిజర్వేషన్లు స్థానిక గిరిజనులకు కల్పించడం, రెండో ఆప్షన్‌గా స్థానిక గిరిజనులకు వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వడం, మూడో ఆప్షన్‌గా సుప్రీంకోర్టు సూచించినట్లు 50 శాతం మించకుండా స్థానిక గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించి వారి హక్కులను పరిరక్షించడం వంటి అవకాశాలను చంద్రబాబు దృష్టికి తెచ్చారు. దీనిపై సీఎం మాట్లాడుతూ గిరిజనుల హక్కులకు కట్టుబడి ఉన్నామని, ఎన్నికల సమయంలో చెప్పినట్లు జీవో 3 పునరుద్ధరించడం లేదా అదే స్థాయిలో గిరిజనులకు న్యాయం చేయడానికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ విషయంలో జాతీయస్థాయిలో రాజ్యాంగ, న్యాయ నిపుణులతో కూడా సంప్రదింపులు జరపాలన్నారు. గిరిజనుల జీవన ప్రమాణాలు పెంచేందుకు విద్య,వైద్య సదుపాయాలు కల్పిస్తూ.. ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. వారికి న్యాయం చేసేందుకు ఉన్న ఏ ఒక్క అవకాశాన్ని వదులుకునే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## షష్ఠ షణ్ముఖ క్షేత్రాలకు జనసేన ఎమ్మెల్యేలు

సైన్యానికి దైవ బలం కోసం నేడు పూజలు



**అమరావతి, మే 12 (జనస్వరం) :** 'ఆపరేషన్ సిందూర్'తో పాకిస్థాన్‌కి గట్టి పాఠం నేర్పిన మన దేశ సైన్యానికి, దేశ నాయకత్వానికి దైవ బలం, ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుకుంటూ షష్ఠ షణ్ముఖ క్షేత్రాల్లో పూజలు చేయించాలని జనసేన అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయించారు. తమిళనాడులోని ఆరు మురుగన్ ఆలయాలతో పాటు కర్ణాటకలో రెండు, మన రాష్ట్రంలోని రెండు సుబ్రహ్మణ్యస్వామి క్షేత్రాలు, విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయం, పిఠాపురం పురుహూతికాదేవి ఆలయాల్లో మంగళవారం జనసేన ఎమ్మెల్యేలు, నేతలు పూజలు నిర్వహిస్తారు. తమిళనాడులోని తిరుపరకుండ్రంలోని ఆలయానికి సుందరపు విజయకుమార్ (యలమంచిలి), పళని క్షేత్రానికి పంతం నానాజీ (కాకినాడ రూరల్), స్వామిమలైకి బొలిశెట్టి శ్రీనివాస్ (తాడేపల్లిగూడెం), తిరుచెందూర్ ఆలయంలో పత్సమట్ల ధర్మరాజు (ఉంగుటూరు), తిరుత్తణిలో ఆరణి శ్రీనివాసులు (తిరుపతి), పాలముదిరిచోళై మురుగన్ ఆలయంలో శ్రీధర్ ( రైల్వేకోడూరు) ఆధ్వర్యంలో పార్టీ నేతలు, శ్రేణులు తరలివెళ్లాయి. మంళవారం ఉదయం ఆయా ఆలయాల్లో పూజలు చేయిస్తారు. కర్ణాటకలోని కుక్కే శ్రీ సుబ్రహ్మణ్య క్షేత్రంలో పూజాదికాల కోసం అనంతపురం నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. ఈ బృందానికి అనంతపురంలోని హిందూపురం అర్బన్ డెవల్‌పమెంట్ ఆథారిటీ చైర్మన్ టి.సి.వరుణ్ నేతృత్వం వహిస్తారు. అలాగే ఘాటీ శ్రీ సుబ్రహ్మణ్య క్షేత్రంలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ నేతృత్వంలోని బృందం పూజలు చేయిస్తుంది. ఇక రాష్ట్రంలో విజయవాడ ఇంద్రకీలాద్రిపై మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ పూజలు చేయిస్తారు. బిక్కవోలు శ్రీసుబ్రహ్మణ్య ఆలయంలో మంత్రి కందుల దుర్గేశ్, మోపిదేవి సుబ్రహ్మణ్య ఆలయంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు జరుగుతాయి. పిఠాపురం పురుహూతిక ఆలయంలో పూజల్లో డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, నియోజకవర్గ సమన్వయకర్త మర్రెడ్డి శ్రీనివాస్ పాల్గొంటారు. క్రైస్తవ ధర్మాన్ని విశ్వసించే పార్టీ నేతలు, శ్రేణులు చర్చిల్లో ప్రార్థనలు చేయిస్తారు. ఇంకోవైపు.. అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారమే శాంతి హోమం చేయించారు. కాగా, నర్సుల దినోత్సవం సందర్భంగా పిఠాపురానికి చెందిన ప్రభుత్వ స్టాఫ్ నర్సులతో పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. నర్సులను సత్కారించారు.

## మాల్స్‌ను తనిఖీ చేసి నివేదిక ఇవ్వండి

- ఫైర్ సేఫ్టీ నిబంధనలను పరిశీలించండి
- అగ్నిమాపక అధికారులకు హోంమంత్రి ఆదేశం



**విజయనగరం, మే 12 (జనస్వరం) :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాల్స్‌పై అగ్నిమాపక శాఖ అధికారులు తనిఖీలు చేసి నెల రోజుల్లో నివేదికలు ఇవ్వాలని హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. సోమవారం విజయనగరం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా సమీక్షా సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని చాలా మాల్స్‌కు అగ్నిమాపక శాఖ అనుమతులు లేవని, వైసీపీ ప్రభుత్వ హయాంలో సెల్ఫ్ డిక్లరేషన్‌తో ఎన్‌వోసీలు ఇచ్చేశారని అన్నారు. మాల్స్‌లో కనీస నిబంధనలు పాటించలేదని, తక్షణమే ఆయా అంశాలను అధికారులు పరిశీలించాలన్నారు. ఫైర్ సేఫ్టీ పాటిస్తున్నారా? లేదా? అనేది చూడాలని ఆదేశించారు.

**రెచ్చకొట్టినట్లు వ్యవహరిస్తే కఠిన చర్యలు :**
మత సంబంధ వ్యవహారాలను ప్రస్తావిస్తూ ఎవరైనా రాజకీయ ముసుగులో రెచ్చకొట్టినట్లు మాట్లాడినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి హెచ్చరించారు. దేశం గురించి ఎవరైనా తక్కువగా మాట్లాడితే విడిచిపెట్టేది లేదన్నారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలోని అమరువీరుల స్థూపం వద్ద పాకిస్థాన్ ముష్కరుల దాడిలో అమరులైన వీర జవాన్లకు నివాళులర్పించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. యుద్ధంలో అమరులైన సైనికుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ జిల్లా పోలీసుశాఖ సోమవారం రాత్రి చేపట్టిన క్యాండిల్ ర్యాలీలో ఇద్దరు మంత్రులతో పాటు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ అంబేద్కర్, ఎస్పీ వకుల్ జిందాల్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.


## పునరుత్పాదక ఇంధన రంగంలో రూ.22 వేల కోట్ల పెట్టుబడులు

17న పలు ప్లాంట్లకు లోకేశ్ భూమిపూజ



**అమరావతి, మే 12 (జనస్వరం) :** రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన రంగంలో రూ.22,000 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. 2019-24 నడుమ ఈ రంగంలో రూపాయి కూడా పెట్టుబడి రాలేదు. 2024లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక అనంతపురం, కర్నూలు జిల్లాల్లో 1,800 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంటు, మరో 1,000 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎసఎస)తో కూడిన సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసేందుకు కొన్ని సంస్థలతో రాష్ట్ర పునరుత్పాదక ఇంధన సంస్థ ఒప్పందాలు చేసుకుంది. తాజాగా రెండు దశల్లో రెండు గిగావాట్ల బీఈఎసఎస్ ప్లాంట్లను ఆనంతపురం జిల్లాలో స్థాపించేందుకు ప్రతిపాదనలు వచ్చాయని రాష్ట్ర పునరుత్పాదక విద్యుత్ అభివృద్ధి సంస్థ వెల్లడించింది. ఇందుకోసం 100 కిలోమీటర్ల మేర అదనపు హైవోల్టేజీ (ఈవీహెచ్) లైన్ ట్రాన్స్‌మిషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 17వ తేదీన పలు పునరుత్పాదక ఇంధన ప్లాంట్లకు మంత్రి లోకేశ్ భూమి పూజ చేయనున్నారు. మొదటి దశలో 587 మెగావాట్ల సోలార్ ప్లాంట్, 250.8 మెగావాట్ల విండ్ ప్రాజెక్టులను, 415 మెగావాట్ల బీఈఎసఎస్ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. ఇంటిగ్రేటెడ్ రెన్యువల్ ఎనర్జీ పాలసీని రాష్ట్రప్రభుత్వం అమల్లోకి తెచ్చిన సంగతి తెలిసిందే. ఏసీఎంఈ సోలార్, రెన్యూ పవర్, గ్రీన్‌కో హోల్డింగ్, యాక్సిస్ విండ్ ఫర్మ్స్, అజూర్ పవర్, మైట్రాస్ వంటి సంస్థలు భారీ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమయ్యాయి.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

తేదీ : 13 మే 2025,
తిథి : బహుళ పాడ్యమి (14తా తె.00:40వ.కు),
నక్షత్రం : విశాఖ (ఉ.09:10వ.కు)
బ్రహ్మ ముహూర్తం : తె.04:05ల తె.04:54
రాహుకాలం : మ.03:15ల సా.04:51,
యమగండం : ఉ.08:53ల ఉ.10:28,
వర్జ్యకాలం : మ.01:39ల మ.03:39

## ఈ రోజు నమాజ్ వేళలు

తేదీ : 13 మే 2025,
ఫజర్ : తెల్లవారుజామున గం. 04:36
సూర్యోదయం : ఉదయం గం. 05:52
జొహర్ : మధ్యాహ్నం గం. 12:16
అసర్ : సాయంత్రం గం. 03:32
మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:40
ఇష : రాత్రి గం. 07:57





జనస్వరం
**విలేకరులు కావలెను**
"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు
రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..
అసక్తి ఉన్న వారు సంప్రదించండి..
సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# వై నాట్ కుప్పం.. ఆ స్లోగన్ ఇప్పుడు రివర్స్!

## ఎడిటోరియల్

వై నాట్ కుప్పం అంటూ హడావిడి చేశారు వైసీపీ నేతలు. కుప్పంలో చంద్రబాబును ఓడిస్తామని శపథం చేశారు. అంతటితో ఆగకుండా కుప్పంలో చంద్రబాబు పర్యటిస్తున్న సమయంలో అడ్డుకున్నారు కూడా. ఒకానొక దశలో దాడి చేసిన ప్రయత్నం చేశారు. అటువంటి కుప్పంలో ప్రస్తుతం సీన్ రివర్స్ అయ్యింది. కనీసం వైసీపీ ఉనికి చాటుకునేందుకు కూడా పడరాని పాట్లు పడుతోంది. కుప్పంలో స్థానిక సంస్థలతోపాటు మున్సిపాలిటీని గెలిచేసరికి చంద్రబాబును సైతం ఓడిస్తామంటూ వైసీపీ శ్రేణులు కయ్యానికి కాలు దువ్వాయి. అక్కడ వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ భరత్‌ను ఎమ్మెల్సీగా చేసేసరికి ఆయన నేనే ఎమ్మెల్యేను అన్నంత రేంజ్‌లో విరుచుకుపడ్డారు. వెనుకా ముందు చూసుకోలేదు. అయితే ఇప్పుడు అదే భరత్‌పై తిరుగుబాటు చేస్తున్నారు వైసీపీ నేతలు. భరత్‌ను నమ్ముకుంటే పార్టీ తుడుచుపెట్టుకుపోతుందని హెచ్చరించారు. హై కమాండ్‌కు హెచ్చరికలు పంపారు.

**చంద్రబాబు మెజారిటీ తగ్గడంతో.. :**

2019 ఎన్నికల్లో చంద్రబాబుపై పోటీ చేశారు భరత్. జగన్ ప్రభంజనంలో చంద్రబాబు మెజారిటీ తగ్గింది. దీంతో భరత్‌ను కార్నర్ చేసుకుని రాజకీయం మొదలుపెట్టారు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. తన పుంగనూరు కంటే కుప్పంపై ఫుల్ ఫోకస్ పెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటారు. మున్సిపల్ ఎన్నికల్లో సైతం వైసీపీ ఘనవిజయం సాధించింది. ఇక కుప్పంలో చంద్రబాబును ఓడించడమే తరువాయి అన్నట్టు వైసీపీ నేతలు వ్యవహరించారు. జగన్మోహన్ రెడ్డి సైతం చంద్రబాబుపై భరత్ గెలిస్తే మంత్రి పదవి ఇస్తానని ప్రకటించారు. అయితే వారు ఒకటి తలిస్తే కుప్పం నియోజకవర్గ ప్రజలు మరోలా తలిచారు. వైసీపీ ఇక్కడ తుడుచుపెట్టుకుపోయింది.




**కనిపించని ఎమ్మెల్సీ భరత్ :**

ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఎమ్మెల్సీ భరత్ నియోజకవర్గంలో కనిపించకుండా మానేశారు. ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నారు. ఈ తరుణంలో నియోజకవర్గంలోని శాంతిపురం జడ్పిటిసి సభ్యుడు శ్రీనివాసులు, సీనియర్ నేత ఏకంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి భరత్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. భరత్ టీడీపీ చేతుల్లోకి వెళ్లిపోయారని విమర్శించారు. టీడీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. భజన పరులకి పదవులు ఇస్తున్నారని మండిపడ్డారు. టీడీపీకి మేలు చేసేలా వైసీపీని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు వైసీపీ సీనియర్ నేతలు. అయితే వెంటనే స్పందించిన భరత్ శాంతిపురం జడ్పిటిసి సభ్యుడు శ్రీనివాసులతో పాటు సీనియర్ నేతలను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున చర్యలు తీసుకున్నామని చెప్పారు.

**వైసీపీ విలవిల.. :**

ప్రస్తుతం కుప్పం నియోజకవర్గంలో వైసీపీ విలవిలలాడుతోంది. కనీసం పార్టీ వాయిస్ వినిపించేవారు కూడా కరువు అవుతున్నారు. వైసీపీ హయాంలో కుప్పంలో ఏ స్థాయిలో విరుచుకుపడ్డారో తెలియనిది కాదు. అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవానికి వెళ్లిన చంద్రబాబుపై దాడి చేసినంత పనిచేశారు. ఓ మాజీ ముఖ్యమంత్రికి దారుణంగా అవమానించారు. అయితే ఇప్పుడు వైసీపీ కాక వికలం అయింది. ఉనికి చాటుకునేందుకు కూడా ఇబ్బంది పడుతోంది.



జమ్ము సాయి కల్యాణ్,
పొలిటికల్ అనలిస్టు,
మేనేజింగ్ డైరెక్టర్,
జనస్వరం మీడియా.

## తొండూరులో సికిల్ సెల్ ఎనిమియాపై అవగాహన శిక్షణ



**పులివెందుల, మే 12 (జనస్వరం) :** నియోజకవర్గంలోని తొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో సోమవారం సికిల్ సెల్ ఎనిమియాపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ఆరిఫుల్లా నేతృత్వంలో ఈ శిక్షణలో మండల విద్యా శాఖ, హాస్టల్ సంక్షేమాధికారి, అంగన్వాడీ సూపర్వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆరిఫుల్లా మాట్లాడుతూ, "సికిల్ సెల్ ఎనిమియా ఒక జన్యుపరమైన వ్యాధి. ఎర్ర రక్త కణాలు కొడవలి ఆకారంలో మారిపోవడం వల్ల రక్తప్రసరణలో ఆటంకం ఏర్పడి, గుండెతో పాటు ఇతర అవయవాలకు రక్త సరఫరా తగ్గిపోతుంది. ఫలితంగా రక్తహీనత, శరీర అవయవాల నష్టం, సంక్రమణ వ్యాధులు, శ్వాస సమస్యలు వంటి ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి," అని వివరించారు. భారతదేశంలోని 17 రాష్ట్రాలలో, ముఖ్యంగా గిరిజన ప్రాంతాలలో, ఈ వ్యాధి తీవ్రంగా వ్యాప్తి చెందుతున్నదని పేర్కొన్నారు. దీనిని అరికట్టేందుకు 5 నెలల నుండి 40 ఏళ్ల వయస్సు గల వారిని లక్ష్యంగా పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. వివాహానికి ముందు, గర్భధారణ సమయంలో సికిల్ సెల్ జీన్స్ పరీక్షలు తప్పనిసరి అని తెలిపారు. గుర్తించిన రోగులకు క్రమమైన చికిత్స, రక్త మార్పిడి, అవసరమైన ఎముక మజ్జ మార్పిడి చికిత్సలు అవసరమని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో తల్లులకు, పాంశాలల్లో విద్యార్థులకు, వసతి గృహాల్లో మరియు ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ వ్యాధి నివారణ కోసం అన్ని శాఖల సమన్వయం కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వారా అందించే ఉచిత రక్త పరీక్షలు, చికిత్సలు, ఉచిత రక్త మార్పిడి, రైలు-బస్ ప్రయాణ సదుపాయాలు, పరీక్షలలో ప్రత్యేక రాయితీలు, విద్యలో రిజర్వేషన్ల వంటి ప్రయోజనాలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆరోగ్య అధికారి విజయ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, అంగన్వాడీ సూపర్వైజర్ రమణమ్మ, హాస్టల్ సంక్షేమ అధికారి ఉమర్ ఫరూక్, సూపర్ వైజర్ శశికళ, ఆరోగ్య కార్యకర్తలు పుల్లమ్మ, శుక్రూ తదితరులు పాల్గొన్నారు.

## పున్నూరు గ్రామ అభివృద్ధి పనులకు శ్రీకారం

### ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి





**కోవూరు, మే 12 (జనస్వరం) :** కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. ఇందుకూరుపేట మండలం పున్నూరు గ్రామంలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పున్నూరు గ్రామ అభివృద్ధికి సంబంధించి చేయవలసిన పనులపై ఆమె స్థానిక నాయకులతో చర్చించారు. గ్రామంలో నిరుపయోగంగా ఉన్న దొరువును విపిఆర్ ఫౌండేషన్ ద్వారా అభివృద్ధి చేసి గ్రామ పంచాయతీకి అప్పగించారు. పున్నూరు-లేబురు గ్రామాలను అనుసంధానించే లింక్ రోడ్డును తాత్కాలికంగా సుమారు 5 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే ఎంపీ లాండ్స్ నిధులు లేదా పంచాయతీరాజ్ నిధులు ద్వారా రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, కల్వర్టును నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పున్నూరు – మూలపాడు వాసుల కోసం విపిఆర్ ఫౌండేషన్ ద్వారా స్మశాన భూమిని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వ నిధులు మంజూరు చేయిస్తామని పేర్కొన్నారు. అలాగే పున్నూరు ఉపాధి హామీ పథకం కింద టెంకాయ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మూలపాడు అంకమ్మ సత్రం, ఎస్సీ, ఎస్టీ కాలనీలోని 700 కొబ్బరి చెట్ల పెంపక కార్యక్రమాన్ని చేపట్టి, నాలుగేళ్లలో వాటి ఆదాయాన్ని గ్రామ అభివృద్ధికి వినియోగిస్తామని చెప్పారు. స్థానిక నాయకులు గ్రామ సమస్యలపై అవగాహన పెంచుకుని, రాజకీయంగా అభివృద్ధి చెందాలని సూచించారు. గ్రామాభివృద్ధికి ఐక్యమత్యంగా కృషి చేయాలని, విభేదాలను పక్కన పెట్టాలని హితవు పలికారు. అనుమతి లేకుండా గ్రావెల్ తవ్వకాలు చేస్తే ఉపేక్షించేది లేదని, ఇసుక, గ్రావెల్ రవాణా ఉదయం 6 గంటల నుంచి రాత్రి 6 గంటల వరకే అధికార అనుమతులతో మాత్రమే జరగాలని ఆమె స్పష్టం చేశారు. "అవినీతి రహిత కోవూరు" నా లక్ష్యమని, అక్రమాలకు పాల్పడే వారిని ఉపేక్షించబోమని ఎమ్మెల్యే హెచ్చరించారు. తన నియోజకవర్గంలో అవినీతి ఘటనలు జరిగి తనకు చెడ్డ పేరు రాకూడదని నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరుపేట మండల టీడీపీ అధ్యక్షులు రావెళ్ల వీరేంద్ర నాయుడు, జిల్లా టీడీపీ ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీ చెంచు కిషోర్ యాదవ్, సీనియర్ నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, స్థానిక నాయకులు చంద్రమోహన్ రెడ్డి, చిట్టి బోయిన వేణు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ వరదరాజుల స్వామి కళ్యాణ మహోత్సవం



**పులివెందుల మే 12 (జనస్వరం) :** నియోజకవర్గంలోని లింగాల మండలం వెలిదండ్ల గ్రామ సమీపంలోని దేవరకోనలో శ్రీదేవి భూదేవి సమేత వరదరాజుల స్వామి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణలు, గోవింద నామ స్మరణల నడుమ, మంగళవాయిద్యాల మధ్య ఆలయ పరిసరాలు పవిత్రతతో పరవశించాయి. ఉదయం 8:30 గంటలకు వెలిదండ్ల గ్రామంలోని శ్రీరామాలయం నుండి కళ్యాణ విగ్రహమూర్తులను గ్రామస్తులు శోభాయాత్రగా దేవంకోన ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం గరుడాద్రి సోమశేఖర శర్మ పౌరోహిత్యంలో స్వామి వారి కళ్యాణం పూర్తయ్యింది. ఈ పుణ్య సందర్భాన్ని పురస్కరించుకొని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి స్వామి వారిని దర్శించి, పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారితో పాటు లింగాల ఎంపీపీ అలవలపాటి రమాదేవి వున్నారు. సాయంత్రం గ్రామ మహిళలు మొలక కుండలను నెత్తిపై మోసుకొని ఊరంతా తిరుగుతూ వివిధ దేవాలయాలను సందర్శించారు. ప్రతి దేవాలయంలో ఒక మొలక కుంపటిని సమర్పించి, పరమాత్మకు తమ భక్తిని వ్యక్తం చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుండి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వారి కోసం గ్రామస్తులు అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## వీర జవాన్ మురళి నాయక్ కుటుంబానికి పరామర్శ



**పులివెందుల మే 12 (జనస్వరం) :** వైఎస్సార్ కడప జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాల విజయ జ్యోతి సోమవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలతో కలిసి శ్రీ సత్య సాయి జిల్లా, గోరంట్ల మండలంలోని కల్లి తాండా గ్రామానికి వెళ్లి దేశ రక్షణలో ప్రాణాలర్పించిన వీర జవాన్ మురళి నాయక్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మురళి నాయక్ తండ్రి శ్రీరాం నాయక్, తల్లి జ్యోతి భాయిని ఓదార్చి, ఈ కష్టసమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు మురళి నాయక్ సమాధిని సందర్శించి, పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విజయజ్యోతి మురళి నాయక్ కుటుంబానికి తన ఒక నెల పెన్షన్ మొత్తం రూ. 50,000లు సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ విజయ జ్యోతి, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర సైనికులు ఎప్పటికీ మరచిపోలేనివారని, మురళి నాయక్ కుటుంబానికి కాంగ్రెస్ పూర్తిగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పులివెందుల, ప్రొద్దుటూరు, కమలాపురం అసెంబ్లీ సమన్వయకర్తలు ధృవకుమార్ రెడ్డి, ఇర్ఫాన్ భాష, అశోక్ కుమార్ రెడ్డి, పీసీసీ డెలిగేట్ డాక్టర్ అన్వర్, డీసీసీ ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్, మైనార్టీ నగర అధ్యక్షులు ముబారక్ భాషా, హరి ప్రసాద్ కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దంపతుల మధ్య గొడవ.. బావ చేతిలో ఇద్దరు బావమరిదిల హత్య

- కుటుంబ కలహం రక్తపాతానికి దారి
- ఒకరికి తీవ్ర గాయాలు
- చింతపల్లి క్యాంపు గ్రామంలో విషాదం
- మద్యం మత్తులో విచక్షణ కోల్పోయిన గెన్ను








**చింతపల్లి/జీకే వీధి, మే 12 (జనస్వరం) :** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని జీకే విధి మండలం చింతపల్లి క్యాంపు గ్రామం సోమవారం ఓ భయానక సంఘటనకు వేదికగా మారింది. కుటుంబ కలహం నేపథ్యంలో చోటుచేసుకున్న రక్తపాతంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం కలకలం రేపుతోంది. ప్రాథమిక సమాచారం మేరకు, చింతపల్లి క్యాంపు గ్రామానికి చెందిన గెన్ను, తన భార్యతో తరుచూ గొడవ పడుతూ ఉండేవాడు. ఇదే క్రమంలో ఇటీవల మరణించిన బంధువు అంత్యక్రియల కోసం గెన్ను బావలు అయిన కిముడు కృష్ణ (ఇంద్రావతికి చెందినవాడు), కిముడు రాజు (విశాఖపట్నం నివాసితుడు) గ్రామానికి వచ్చారు. అంత్యక్రియల అనంతరం ముగ్గురూ కలిసి గెన్ను సీలేరు గ్రామానికి వెళ్లి మద్యం సేవించారు. తరువాత చింతపల్లి క్యాంపుకు తిరిగి వచ్చిన గెన్ను, మద్యం మత్తులో భార్యతో గొడవపడి దాడికి దిగాడు. అక్కను ఎందుకు కొడుతున్నావని ప్రశ్నించిన బావలు కృష్ణ, రాజులపై గెన్ను ఆగ్రహానికి లోనయ్యాడు. ఇంట్లోకి వెళ్లి బరిసె తీసుకొచ్చి వారిపై అతి దారుణంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ కృష్ణ, రాజు సంఘటన స్థలంలోనే ప్రాణాలు విడిచారు. ఈ దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరొక బావ రాజు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన రాజును అంబులెన్స్ ద్వారా విశాఖపట్నం కింగ్ జార్జి ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు సమాచారం. విషయం తెలిసిన వెంటనే సీలేరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పర్యవేక్షణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సంఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. క్షణాల్లోనే మూడు కుటుంబాలు శోక సంద్రంలో మునిగిపోయాయి. మద్యం మత్తులో విచక్షణ కోల్పోతే ఎలాంటి దారుణ ఘటనలు చోటు చేసుకోగలవో ఈ సంఘటన మరోసారి స్పష్టం చేసింది.

## వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని.. మల్లమ్మ జయంతోత్సవం..



**శ్రీశైలం, మే 12 (జనస్వరం) :** శ్రీశైలమల్లికార్జున స్వామివారి పరమ భక్తులలో ఒకరైన మల్లమ్మ జయంతోత్సవం వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం ఉదయం దేవస్థానం గోశాల సమీపంలో ఉన్నటువంటి హేమారెడ్డి మల్లమ్మ (మల్లమ్మ కన్నీరు) ఆలయంలో ఆలయ అర్చకులు జయంతోత్సవ సంకల్పం పఠించి తదుపరి కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు గాను మహాగణపతి పూజను జరిపించి మల్లమ్మ వారికి పంచామృతాభిషేకం, జలాభిషేకం, విశేషపూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో కార్యనిర్వాహణాధికారి యం శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు.

## మల్లన్న సన్నిధిలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి



**శ్రీశైలం, మే 12 (జనస్వరం) :** శ్రీశైలభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. స్వామివార్ల దర్శనార్థమై బుధవారం ఉదయం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న బుడ్డారాజశేఖరరెడ్డికి కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు అర్చక వేదపండితులు ఆలయ సంప్రదాయంలో భాగంగా స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జునస్వామి వారికి విశేష రుద్రాభిషేకం, శ్రీభ్రమరాంబదేవికి విశేష కుంకుమార్చనాది విశేష పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం ఆలయ సంప్రదాయంలో భాగంగా అమ్మవారి ఆలయప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో బుడ్డా రాజశేఖర రెడ్డికి అర్చక వేదపండితులు వేదఆశీర్వచనాలు వల్లించగా కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు స్వామివార్ల శేషవస్త్రాలను, స్వామివార్ల జ్ఞాపిక, ప్రసాదాలనిచ్చి సత్కరించారు. తదుపరి క్షేత్రంలోని అభివృద్ధి పనులపై కార్యనిర్వాహణాధికారి ఎం. శ్రీనివాసరావుతో చర్చించారు.

# లుచ్ఛా, బ్రోకర్, వైసీపీ కోవర్ట్ నేను కాదు

- ఆ మాటలు అన్ని పల్లాకే వర్తిస్తాయి
- తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్
- గుడివాడ అమర్ అసమర్థుడు కాబట్టి పల్లాకు భారీ మెజారిటీ
- అదే గనుక వైసీపీ కార్యకర్త ఎవరైనా సరే అయితే పల్లా ఓటమి తథ్యం



**విశాఖపట్నం, మే 12 (జనస్వరం) :** తానొక లుచ్ఛా, బ్రోకర్, వైసీపీ కోవర్ట్ అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు తనపై నిరాధారమైన ఆరోపణలు చేశారని.. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ప్రస్తావించారు. లుచ్ఛా, బ్రోకర్, వైసీపీ కోవర్ట్ అన్నీ కూడా పల్లాకే వర్తిస్తుందని ఆరోపించారు. మాజీ కోడిగుడ్ల శాఖ మంత్రి గుడివాడ అమర్‌కు పల్లా అమ్ముడుపోయారన్నారు. ఇదే విషయమై నగరంలోని హెూటల్ దసపల్లాలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. పల్లా శ్రీనివాస రావు అండ్ కోకు బుద్ధి చెప్పే క్రమంలో శిక్షణ తరగతులను హెూటల్ దసపల్లా వేదికగా ఏర్పాటు చేశామన్నారు. అయితే పల్లా గాని, అతని అనుచరులు గాని శిక్షణ తరగతులకు హాజరు కాలేదని ఎద్దేవా చేశారు. పల్లా శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా విశాఖ వ్యాప్తంగా.. జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ భారీ ఎత్తున ఫ్లెక్సీలు, బ్యానర్లను ఏర్పాటు చేయించుకున్నారన్నారు. అవతల వారికి ఇష్టం లేకపోయినా బలవంతంగా ఫ్లెక్సీలు బ్యానర్లను ఏర్పాటు చేయడంలో పల్లా వద్ద ప్రధాన అనుచరులలో ఒకడుగా ఉన్న మురళి చూసుకుంటున్నారని పేర్కొన్నారు. పల్లా పేరుకే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్నారు తప్ప.. కనీసం పొరుగునే ఉన్న విజయనగరం జిల్లాకు కూడా వెళ్లకుండా గాజువాకలోనే దందాలు చేస్తున్నారని ఆరోపించారు. తాను వైసీపీ కోవర్ట్ కాదని, టీడీపీ అభిమానిని అని సీఎం చంద్రబాబు చెప్పేవరకు తన దండయాత్ర కొనసాగుతూనే ఉంటుందన్నారు. దేశంలో ఉగ్రవాదులను ఏరివేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్ కొనసాగిస్తే.. టీడీపీలో కోవర్ట్ లను ఏరివేసేందుకు ఆపరేషన్ పల్లా నిర్వహిస్తున్నానని తెలిపారు. తను వార్డు కార్పొరేటర్ కూడా గెలవలేనని పల్లా అనుచరులు ప్రగల్భాలు పలుకుతున్నారని.. నిజంగా పల్లాకు దమ్ముంటే ఎమ్మెల్యే పదవి రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలన్నారు. రాష్ట్రంలో అత్యధిక మెజారిటీ 93,000 ఓట్లు వచ్చిందని.. అదంతా తన సామర్థ్యమైననే పల్లా భ్రమలో ఉన్నారన్నారు. అసమర్థుడైన మాజీ కోడిగుడ్ల శాఖ మంత్రి గుడివాడ అమర్‌పై గెలుపు ఒక గెలుపు కాదన్నారు. గుడివాడ స్థానంలో వైసీపీ కార్యకర్త ఎవరైనా సరే పోటీ చేసి ఉంటే పల్లా చిత్తుచిత్తుగా ఓటమిపాలు అయ్యేవారన్నారు. నిజంగా పల్లా శ్రీనివాసరావుకు దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్ళీ పోటీ చేయాలన్నారు. తాను స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసి కనీసం ఓటు కూడా అడగకుండా విదేశాలకు వెళ్ళిపోతానని అన్నారు. అప్పుడేనా కనీసం పల్లా గెలవగలరా అని రామ్ ప్రశ్నించారు.

**నర్సులపై నిర్లక్ష్యం తగదు :**

ప్రజాప్రతినిధులు కన్నా నర్సులు తమ ప్రాణాలను కుటుంబాన్ని ఫణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారు అన్నారు. అటువంటి నర్సులను ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తుందని, నర్సుల దినోత్సవం ప్రభుత్వం నిర్వహించకపోవడం విచారకరమన్నారు. కనీసం వచ్చే ఏడాది అయినా నైటింగేల్ జన్మదినాన్ని ప్రభుత్వం ఘనంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా కేజీహెచ్ నర్సులైన ఉషారాణి, శారదాంబ, హైమావతిదేవి, సీతారామలక్ష్మికి వీజేఎఫ్ ప్రెస్ క్లబ్ వేదికగా బీ.వీ.రామ్ సత్కరించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన జనసేన కార్పొరేటర్ కందుల నాగరాజు మాట్లాడుతూ.. ఆసుపత్రుల్లో రోగులకు నర్సులు అందిస్తున్న సేవల కోసం ఎంత చెప్పినా తక్కువేనని పేర్కొన్నారు. ఈ సందర్భంలో నర్సులు మాట్లాడుతూ తమను గుర్తించిన తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఘనంగా అన్నమాచార్య జయంతి వేడుకలు




శేరిలింగంపల్లి, మే 12 (జనస్వరం) : పద్మశ్రీ డా.శోభారాజు ఆధ్వర్యంలో అన్నమాచార్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం చిక్కడపల్లి లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నుండి ట్యాంక్ బండ్ మీద ఉన్న అన్నమయ్య విగ్రహం వరకు వేంకటేశ్వర స్వామి, అన్నమయ్య వారి అర్చా మూర్తులతో పాటు చేరుకుని అక్కడ మహా నగర సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాజు, వారి శిష్యులు సంయుక్తంగా తొలుత "హరి యవతారమీతడు, బ్రహ్మమొక్కటే పర, వేడుకొందామా" అనే అన్నమయ్య సంకీర్తనలు భక్తి రంజకంగా ఆలపించిన తదుపరి స్వామివారికి అన్నమయ్య అష్టోత్తర శతనామావళి (పుష్ప పూజ) అర్పించారు. అన్నమయ్య వేషధారణ మానస పటేల్ శ్రీ వేంకటేశ్వర స్వామి వేషధారణ సాంధీప్ వేయగా పద్మశ్రీ పురస్కార గ్రహీత డా శోభా రాజు రచించి, స్వర పరచిన "ఎక్కడున్నావ్ ఓ కల్కి దేవా! మనసారా నిను జూడ కదలి రావా!" అంటూ ఒక ప్రత్యేక సంకీర్తన పాడారు. అతిథులు మాట్లాడుతూ "శ్రీ వేంకటేశ్వర స్వామియే కల్కి, ఆయన ఖడ్గమే (శ్రీ నందకమే) అన్నమయ్య అని, శోభా రాజు చేస్తున్న అన్నమయ్య యజ్ఞం రానున్న సమాజానికి ఎంతో మేలు చేకూరుస్తుందని" తెలిపారు. శిష్యులు, భక్తులు విచ్చేసిన ఈ అద్భుతమైన జయంతి వేడుకకు చివరిగా శ్రీ స్వర సిద్ధి వేంకటేశ్వర స్వామి వారికి, అన్నమయ్యకు హారతి అందించి పసందైన భోజన ప్రసాద వితరణ జరిగింది.

## మండు వేసవిలో ఉపాధ్యాయులకు శిక్షణ సరికాదు..

### తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు బాకారం మల్లయ్య



**బొంరాస్‌పేట, మే 12 (జనస్వరం) :** రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు మండు వేసవిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం సరైనది కాదని తెలంగాణ రాష్ట్ర తపస్ ఉపాధ్యాయ సంఘం తర పున తీవ్రంగా ఖండిస్తున్నట్లు వికారాబాద్ జిల్లా తపస్ ఉపాధ్యక్షుడు బాకారం మల్లయ్య అన్నారు. టీచర్లకు వేసవిలో వెకేషన్ పీరియడ్ సెలవులు నష్టపోయే అవకాశం ఉంది. అదేవిధంగా ఆరోగ్య ఇబ్బందులు ఉన్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు అదేవిధంగా ప్రభుత్వ ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

## తరోడ గ్రామంలో బుద్ధ పూర్ణిమ




**ముథోల్, మే 12 (జనస్వరం) :** ప్రపంచ మానవాళికి చక్కటి జీవన విధానాన్ని అందించిన గౌతమ బుద్ధుడు గొప్ప దార్శనీయకుడని, ఆయన చూపిన మార్గం ఆచరణీయమని తరోడ గ్రామ ప్రజలు అన్నారు. తరోడ గ్రామంలో గ్రామ ప్రజలు సోమవారం బుద్ధ పూర్ణిమ వేడుకలు నిర్వహించారు. ముందుగా బుద్ధుడు అంబేద్కర్ చిత్రపటాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ వైశాఖ శుద్ధ పూర్ణిమ రోజున లుంబినిలో గౌతమ బుద్ధుడు జన్మించారన్నారు. బుధుడు మహాబోధి వృక్షం కింద జ్ఞానోదయాన్ని పొందింది క్రీస్తుపూర్వం 588లో గౌతముడికి జ్ఞానోదయమైన రోజు అని వారు తెలిపారు. గౌతమబుద్ధుని బోధనలు ప్రపంచం మొత్తానికి ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గడపాలే కల్పన, సంజు, రవి, కిరణ్, అజ్మత్, మహిళలు పాల్గొన్నారు.

## మన్యంలో విద్యా ప్రమాణాల పతనం..

- చోద్యం చూస్తున్న అధికారులు
- జీరో పర్సంటేజీతో షాక్ ఇచ్చిన పాఠశాలలు



**చింతపల్లి, మే 12 (జనస్వరం) :** మన్యంలో విద్యా రంగం రోజురోజుకు దిగజారుతుండటం గమనార్హం. విద్యార్థుల భవితవ్యంపై తీవ్ర ప్రభావం చూపే విధంగా కొంత మంది ఉపాధ్యాయుల నిర్లక్ష్యం, సంబంధిత శాఖ అధికారుల అలసత్వం విద్యా ప్రమాణాలను కుంగదీస్తున్నాయి. తాజాగా వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో అల్లూరి జిల్లా పలు పాఠశాలలు జీరో పర్సంటేజీ నమోదు చేయడం ఈ పరిస్థితికి నిదర్శనంగా నిలుస్తోంది. మండలానికి అత్యంత దూర ప్రాంతమైన దారకొండ, జర్రెల, అప్పర్ సీలేరు, దుంబ్రిగుడ వంటి ప్రాంతాల్లోని ఆశ్రమ పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా ఉత్తీర్ణత సాధించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇతర పాఠశాలల పరిస్థితి కూడా భిన్నంగా లేదు. బందవీధి బాలికల పాఠశాల నుండి 66 మందిలో ఒక్కరు, పెదవలస, లంబసింగి, జి.మాడుగుల, నుర్మతి, బొర్రా, బొడ్డపుట్టు బాలుర పాఠశాల నుండి ఒక్కరు కూడా ఉత్తీర్ణత సాధించలేనీ పరిస్థితి కనిపిస్తోంది. ఈ గణాంకాలన్నీ మన్యంలో విద్యా విధానంపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఇదే సమయంలో కొంత మంది ఉపాధ్యాయులు విధులకు హాజరుకాకుండా గ్రామస్థులను వాలంటీర్లుగా నియమించి పనిమీద పనిగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు ఈ ఆరోపణలపై గమనిక తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇక రేపు జరగనున్న సప్లిమెంటరీ పరీక్షలను దళారులు తమ లబ్ధికోసం వాడుకునే అవకాశాలు ఉన్నాయని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఓపెన్ పది, ఇంటర్మీడియట్ పరీక్షల పేరుతో ఫిక్స్ రేట్లకు దళారులు 'సేవలు' అందిస్తున్నారని ప్రచారం జోరందుకుంది. దీనివల్ల మన్యంలో విద్య దళారులకు లాభాల బాటగా మారే ప్రమాదం నెలకొంది. ఈ పరిస్థితి మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికార యంత్రాంగం మేలుకుని వెంటనే చర్యలు చేపట్టకపోతే, మన్యంలో విద్యా రంగం మరింత పతనాన్ని చవిచూడవలసిన అవసరం తలెత్తుతుంది. ఇప్పటికైనా పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పునరుద్ధరణకు కసితో పనిచేయాల్సిన సమయం వచ్చింది.

## శ్రీశైలం డ్యామ్ పరిశీలించిన సీడీఓ బృందం

### ప్లంజ్ పూల్ ధ్వంసం ఘటనపై సర్వే



**శ్రీశైలం, మే 12 (జనస్వరం) :** శ్రీశైలం జలాశయం దిగువ భాగంలో ఉన్న ప్లంజ్ పూల్ ప్రాంతంలో కాంక్రీట్ స్టీల్ సిలిండర్ డ్రమ్స్ భారీ వరదల కారణంగా తీవ్రంగా ధ్వంసమైన ఘటనపై అధికార యంత్రాంగం చొరవ చూపింది. సోమవారం సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో) బృందం సంఘటిత ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించింది. సీడీవో చీఫ్ ఇంజినీర్ విజయభాస్కర్ నేతృత్వంలోని నిపుణుల బృందం ప్లంజ్ పూల్ ప్రాంతాన్ని పరిశీలించి, ధ్వంసానికి గల కారణాలను, తక్షణ మరమ్మత్తుల అవసరాలను గుర్తించేందుకు సుదీర్ఘ సమయం పాటు సర్వే నిర్వహించింది. ప్రస్తుత నీటి నిల్వ స్థితి, భవిష్యత్ వరదలు ఎదుర్కొనే సన్నద్ధత తదితర అంశాలపై బృందం సమగ్రంగా మౌలిక సమాచారం సేకరించింది. శ్రీశైలం డ్యామ్ భద్రతపై ప్రజల్లో నెలకొన్న ఆందోళనలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నిపుణుల నివేదిక ప్రకారం అవసరమైన మరమ్మత్తులు, బలపరిచే పనులు తక్షణమే ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం. భారీ వర్షాలు, వరదల కాలంలో డ్యామ్ సురక్షితంగా ఉండేందుకు అవసరమైన ప్రతిష్టాత్మక చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.

## ఘనంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు



**నెల్లూరు, మే 12 (జనస్వరం) :** రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేసి జన్మదిన వేడుకలను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోనే 175 నియోజకవర్గాలలో అత్యధిక మెజారిటీతో గాజువాక నియోజకవర్గం నుండి గెలుపొందారు అంటే ప్రజలతో ఏవిధంగా మమేకమయ్యారో, అందుబాటులో ఉన్నారో మన అందరికీ అర్థమవుతుందన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు, యువ నాయకులు నారా లోకేష్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా సమర్థత గల వ్యక్తిని నియమించడం చాలా సంతోషంగా ఉందన్నారు. బూత్ ఇంచార్జి నుండి ప్రతి నాయకునితో ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గ పక్షాన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకుపోతున్న వ్యక్తి పల్లా. శ్రీనివాస్ రావు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ క్లస్టర్ ఇన్చార్జులు, డివిజన్ కార్పొరేటర్లు, టీడీపీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు

- సమస్యల పరిష్కారం కొరకు అందరం కలిసి పని చేద్దాం
- నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి




**నెల్లూరు, మే 12 (జనస్వరం) :** రూరల్ నియోజకవర్గంలోని 1వ డివిజన్, నవలాకుల తోటకు చెందిన వైసీపీ నాయకులు ఓట్ల పురుషోత్తం, చింతా సుబ్రహ్మణ్యం, వినుకొండ గోవిందరావు, పావేటి బాల చిన్నయ్య, దార్ల వెంకటరత్నం, బి.వెంకటేష్ తదితరులు పెద్దఎత్తున తమ మిత్ర బృందంతో కలిసి టీడీపీలో చేరారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సమక్షంలో వీరికి పార్టీ కండువాలు కప్పి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రజా సమస్యల పరిష్కారం కోసం అందరం కలిసి పని చేద్దాం. ఓటు వేయనివారు, నాకువ్యతిరేకంగా ఉన్నవారైనా సమస్యలు ఉంటే ఎటువంటి సంకోచం లేకుండా నన్ను సంప్రదించండి. నా చేతిలో ఉన్న సాయం తప్పకుండా చేస్తాను," అని హామీ ఇచ్చారు. అలాగే, "కార్యకర్త బాగుంటే నాయకుడు బాగుంటాడు, నాయకుడు బాగుంటే పార్టీ బలపడుతుంది అనే నమ్మకంతో పనిచేస్తున్నాను," అన్నారు. రూరల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. గతంలో తన ఎమ్మెల్యే పదవికాలంలో 26 డివిజన్ల కార్పొరేటర్లు, 18 గ్రామాల సర్పంచులు, 12 ఎంపీటీసీలు, ఒక జడ్పీటీసీని గెలిపిం చామని గుర్తు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అదే ధీమాతో విజయం సాధించి, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు విజయాన్ని కానుకగా అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కోడూరు కమలాకర్ రెడ్డి, ఎం.డి. జావీద్, రాచూరు జానకిరామయ్య, యనమల శేషు యాదవ్, సుబ్బరామయ్య, బాబు, నాగేంద్ర, బల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల్ని ప్రభావితం చేస్తున్న పవన్ కళ్యాణ్ భావజాలం

### ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్



**గుంటూరు, మే 12 (జనస్వరం) :** దేశం మీద అమితమైన భక్తి, సమాజం పట్ల బాధ్యత, ప్రజలపై గురుతరమైన ప్రేమ, పరిపాలనలో పారదర్శకత, ప్రకృతి, భాషా, సంస్కృతులు, పర్యావరణ పరిరక్షణలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ముందుకు సాగుతున్న జనసేనాని పవన్ కళ్యాణ్ భావజాలం ప్రజల్ని ఎంతగానో ప్రభావితం చేస్తుందని ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ అన్నారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయనను జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం రికార్డు స్థాయిలో చేపడుతున్న అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని హరిప్రసాద్ సూచించారు. మోదీ ఆశీస్సులతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల నాయకత్వంలో రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందని, అందుకే ప్రజలంతా ఇది మంచి ప్రభుత్వం అంటున్నారని హరిప్రసాద్ అన్నారు. జనసేన రాష్ట్ర ప్రోగ్రామింగ్ కమిటీ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్‌ను ఆళ్ళ హరి ప్రత్యేకంగా కలిశారు.

## డీఎస్సీ గడువు పొడిగించండి

### సిటీ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కె.సంజయ్ కుమార్



**నెల్లూరు, మే 12 (జనస్వరం) :** డీఎస్సీ అభ్యర్థుల వయోపరిమితిని 47కు పెంచాలని, ప్రిపరేషన్ సమయం 45 రోజుల నుంచి 90 రోజులకు పెంచాలని సిటీ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి సూచన మేరకు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని, ఈ సందర్భంగా సిటీ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కే సంజయ్ కుమార్ మాట్లాడుతూ కొన్ని నెలలుగా బీఈడీ, డిఈడి నూతనంగా విద్యా సంవత్సరం పూర్తి చేసుకున్న అభ్యర్థులు టెట్, డీఎస్సీ రాయడానికి అవకాశం ఇవ్వాలని, ఎంతో ఆవేదనతో మొరపెట్టిన వారికి అవకాశం ఇవ్వకుండా, ప్రభుత్వం మొండి వైఖరితో 45 రోజుల్లో పరీక్ష నిర్వహిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని ఆక్షేపించారు. ఏడు సంవత్సరాల తర్వాత నిర్వహిస్తున్న ఈ పరీక్ష లక్షలాది మంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నీ పూర్తిచేయాలని, పరీక్ష విడతల వారీగా కాకుండా ఆన్లైన్లో ఒకేసారి నిర్వహించాలని ఒకే జిల్లాకు ఒకే పేపర్ పెట్టాలని జనరల్ సెక్రెటరీ అడ్వకేట్ సుధీర్, రూరల్ నాయకులు మల్లికార్జున రెడ్డి డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో తెలియజేసిన విధంగా ప్రతి సంవత్సరం క్యాలెండర్ ఇయర్ వలె డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఇర్ఫాన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అల్లావుద్దీన్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు రెహమాన్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్సీ బీద రవిచంద్రకి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ ఆహ్వానం



**నెల్లూరు, మే 12 (జనస్వరం) :** రూరల్ నియోజకవర్గంలో ఈ నెల 15న 339 అభివృద్ధి పనులకు సంబంధించి ప్రారంభోత్సవ కార్యక్రమం ఉండడంతో ఎమ్మెల్సీ బీద రవిచంద్రకి టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం పలు అంశాలపై కాసేపు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## పిన్నమనేని (అబ్బు)ను పరామర్శించిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కొలికపూడి



**ఎ.కొండూరు మండలం, మే 12 (జనస్వరం) :** ఇటీవలి ప్రమాదంలో గాయపడి కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు పిన్నమనేని శ్రీనివాసరావు (అబ్బు)ను సోమవారం ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పరామర్శించారు. తిరువూరులో పబ్లిక్ గ్రీవెన్స్, కార్యకర్తల సమావేశాల్లో పాల్గొనేందుకు తిరువూరుకు వచ్చిన ఎంపీ కేశినేని శివనాథ్, సమీపంలోని కృష్ణారావుపాలెంలో నివసిస్తున్న పిన్నమనేని శ్రీనివాసరావును ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. పిన్నమనేని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎంపీ, చికిత్స వివరాలను, తీసుకుంటున్న వైద్యం గురించి తెలుసుకున్నారు. ఆరోగ్య విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా పూర్తిగా కోలుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.

## మైలవరం నియోజకవర్గం రాష్ట్ర, దేశీయ క్రీడలకు ప్రాంగణం కానుంది

**ఎంపీ కేశినేని శివనాథ్**



**మైలవరం, మే 12 (జనస్వరం) :** యువతిలో ఏకాగ్రతను పెంపొందించడంలో, మానసిక ఉల్లాసాన్ని అందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని, రాబోయే కాలంలో మైలవరం నియోజకవర్గం రాష్ట్రం, దేశ స్థాయి క్రీడలకు ముఖ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక లక్కిరెడ్డి హనిమిరెడ్డి మైదానంలో వసంత సమ్మర్ ఉమ్మడి కృష్ణా జిల్లా కబడ్డీ టోర్నమెంట్-2025 ప్రారంభ వేడుకలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు వసంత వెంకట కృష్ణప్రసాద్, కొలికిపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రారంభ కార్యక్రమం అనంతరం చెవుటూరు, కుంటముక్కల గ్రామాల జట్ల మధ్య జరిగిన కబడ్డీ మ్యాచ్‌ను ప్రజాప్రతినిధులు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, "ఐపీఎల్ మ్యాచులు ఎంత ఉత్సాహంగా సాగుతున్నాయో అదే ఉత్సాహంతో గ్రామీణ స్థాయిలో కబడ్డీ పోటీలు కూడా జరుగుతున్నాయి. మైలవరం నియోజకవర్గం త్వరలోనే ఆంధ్రప్రదేశ్ క్రీడల అభివృద్ధికి ఒక కేంద్రంగా మారనుంది," అని తెలిపారు. అమరావతి స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుతో అన్ని క్రీడలకు సముచిత స్థానం లభిస్తుందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా లోని అన్ని నియోజకవర్గాల్లో ప్రత్యేక క్రీడా పోటీలు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే నందిగామలో కేశినేని ఫౌండేషన్ ద్వారా క్రికెట్ పోటీలు విజయవంతంగా నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, గ్రామీణ క్రీడలకు చిరస్థాయిగా ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన లంకా లతీష్‌ను అభినందించారు. ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ తన నియోజకవర్గంలో కూడా క్రీడా పోటీలు నిర్వహించి క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి అక్కల రామ్మోహన్ రావు (గాంధీ), టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి జంపాల సీతారామయ్య, తెలుగు యువత మైలవరం నియోజకవర్గ అధ్యక్షుడు లంకా లతీష్, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు భారీగా పాల్గొన్నారు.

## ఏపీ 2047 స్వర్ణాంధ్ర సాధనే ధ్యేయం

**సీఎం చంద్రబాబు కోసం ప్రత్యేక పూజలు**



**కొత్తచెరువు, మే 12 (జనస్వరం) :** ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి 'స్వర్ణాంధ్ర' రాష్ట్రంగా తీర్చిదిద్దడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాన లక్ష్యమని, ఈ దిశగా రాష్ట్ర ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ చంద్రబాబుకు ఉండాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆకాంక్షించారు. కొత్త చెరువు మండల కేంద్రంలోని సంగమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం జరిగిన రథోత్సవంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా ఆలయంలో శివుని ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందుకున్నారు. సంగమేశ్వరుని ఆశీస్సులతో రాష్ట్రానికి, కూటమి ప్రభుత్వానికి మేలు కలగాలని ప్రత్యేకంగా ప్రార్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే సింధూర రెడ్డి, "అపారమైన అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టించిన నాయకుడు చంద్రబాబు నాయుడు. ఆయన పాలన దేశానికి ఆదర్శప్రాయమవుతోంది," అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆశీస్సులతో మరింత బలపడుతుందని తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణాలు పూర్తయితే ఆంధ్రప్రదేశ్ దేశానికి మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. అనంతరం కొత్త చెరువు గ్రామంలోని షాదిఖానాను పరిశీలించిన ప్రజాప్రతినిధులు, అక్కడ చేపట్టిన మరమ్మత్తు పనులపై అధికారులతో చర్చించారు. పుట్టపర్తి పట్టణంలో జరిగిన 19వ వార్డు గృహప్రవేశ కార్యక్రమంలో సతీష్ నాయక్ నివాసంలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కొత్త చెరువు మండల కన్వీనర్లు వలిపి శ్రీనివాసులు, రామకృష్ణ, టిడిపి సీనియర్ నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, మాజీ జెడ్పిటిసి లక్ష్మీనారాయణ, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## అలివేలమ్మ తిరునాళ్ల మహోత్సవంలో పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**చందర్లపాడు, మే 12 (జనస్వరం) :** మండలంలోని చందర్లపాడు గ్రామంలో సోమవారం నిర్వహించిన అలివేలమ్మ తిరునాళ్ల మహోత్సవం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని ఆలయాన్ని దర్శించుకున్నారు. వారు అలివేలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాల కోసం విచ్చేసిన జబర్దస్త్ టీం సభ్యులకు ఎంపీ కేశినేని శివనాథ్, అమ్మవారి చిత్రపటాలను బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో గ్రామ దేవతలు గ్రామ శ్రేయస్సు కోసం పరిరక్షకులుగా నిలుస్తారని, గ్రామస్థుల జీవితాలలో సుఖసంతోషాలను ప్రసాదిస్తారని పేర్కొన్నారు. అలివేలమ్మ అమ్మవారి దీవెనలతో గ్రామస్థులు ఆయురారోగ్యాలతో, ఆనందమయ జీవితాలను గడపాలని కోరుకున్నట్లు తెలిపారు.

## టీడీపీ కేంద్ర కార్యాలయంలో గ్రీవెన్స్.. వివిధ సమస్యలపై ప్రజల విజ్ఞప్తులు



**మంగళగిరి, మే 12 (జనస్వరం) :** టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమావారం నిర్వహించిన గ్రీవెన్స్ సమావేశంలో, ప్రజలు వివిధ సమస్యలపై తమ విజ్ఞప్తులు చేసి, పరిష్కారం కోసం న్యాయాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరంలు పాల్గొని ప్రజల సమస్యలు ఆగ్రహంతో విన్నారు.

**మీనర్ బాలికపై అఘాయిత్యం :**
తిరువూరు మండలంలోని ఓ తండ్రి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి, తన కూతురిపై మిద్దె ఈశ్వర్, మిద్దె నాగరాజు, మిద్దె పాపారావులు అఘాయిత్యం చేశారని ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. "పోలీసులు దోషులను శిక్షించేందుకు ప్రయత్నించినా, రాజకీయ ప్రలోభాలకు లొంగిపోయి రాజీ చేయమని బెదిరించారని" అన్నారు.

**ఆర్బీ రెడ్డి భూమి సమస్య :**
శ్రీ సత్యసాయి జిల్లా నల్లమడ మండలంలోని ఆర్. బోడేనాయక్, ఐదెకరాల భూమి పరిష్కారం కోసం ప్రభుత్వ సహాయం కోరారు. "మునుపటి వైసీపీ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ఆ భూమిని మార్కెట్ యార్డ్ కోసం తీసుకొని, ఇంతవరకు ఎటువంటి పరిహారం ఇవ్వలేదు" అని తెలిపారు.

**భూమి ఆక్రమణపై సమస్య :**
అన్నమయ్య జిల్లా ములకలచెరువు మండలంలో, గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు షెడ్యూల్డ్ కులాల భూమిని ఆక్రమించుకుని, అధికారుల సహకారం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

**అక్రమ లైసెన్సులపై చర్య :**
రాప్తాడు మండలంలోని యర్రగుంట గ్రామంలో, కోర్టులో ఉన్న భూమికి అక్రమంగా బ్లాస్టింగ్ లైసెన్స్ ఇవ్వడం, వైసీపీ నేతల అనుచరులకు సహకారం ఇవ్వడం అనే విషయంపై విచారణ జరిపి, అక్రమ లైసెన్సులను రద్దు చేయాలని గ్రామస్థులు కోరారు.

**నకిలీ పట్టాలు సృష్టించడం :**
అనకాపల్లి జిల్లా పిసినికాడ గ్రామంలో ఎస్సీలకు సంబంధించి నకిలీ పట్టాలు సృష్టించిన వారిపై, వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గుంటా నరసింహులు విజ్ఞప్తి చేశారు.

**భూమి ఆక్రమణ, న్యాయం కోసం విజ్ఞప్తి :**
ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని శిరిగిరి పున్నమ్మ, తన తండ్రి భూమిని అక్రమంగా ఆక్రమించిన కొమ్మూరు శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోమని విజ్ఞప్తి చేశారు.

**ప్రాణహానిపై విజ్ఞప్తి :**
చిత్తూరు జిల్లా సదుం మండలంలోని డి. వెంకటరమణ, తనపై జరిగిన దాడి గురించి పోలీసులకు ఫిర్యాదు చేసినా, ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ప్రాణహాని నుండి రక్షణ కల్పించాలని కోరారు.

**భూమి సంబంధిత సమస్యలు :**
కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలో గుళ్లపల్లి దుర్గాప్రసాద్ రావు, కుటుంబ సభ్యులపై అడ్డుపడుతున్న గుళ్లపల్లి సురిబాబు పై పోలీసులకు చర్యలు తీసుకోవాలని కోరారు.

**భూమి రికార్డుల సమస్య :**
చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలంలోని రైతులు, గతంలో ఇచ్చిన భూమి కేటాయింపులకు సంబంధించిన రికార్డుల పరిపాలనపై అధికారులు అస్పష్టత చూపుతున్నారని, దయచేసి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

**ఫోర్జరీ డాక్యుమెంట్లు :**
ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నున్న కేసులో, పక్కన ఇంటి కొనుగోలు చేసిన వ్యక్తులు తమకు బెదిరించారని, ఫోర్జరీ డాక్యుమెంట్లపై చర్యలు తీసుకోవాలని వారి విజ్ఞప్తి.

## ఘనంగా రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు



**యలమంచిలి, మే 12 (జనస్వరం) :** నియోజకవర్గంలోని అచ్చుతాపురం టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, యలమంచిలి నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేక్ కటింగ్ చేసి, కార్యకర్తలకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్, రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, ఆడారి మంజు, జనపరెడ్డి నరసింగ రావు, లాలం రాము, వెదురువాడ గ్రామ సర్పంచ్ కొయ్య శ్రీను, లాలం రాజు, కర్రి రమణ, రాజన విజయ్, కాళ్ళ రాజబాబు, పతివాడ చిన్నయ్య నాయుడు, ఉల్లింగల సంతోష్, అడారి జగన్నాథరావు, దాసరి నర్సింగరావు, కట్టుమూరి చిట్టేశ్వరావు, రాయి శ్రీను, ధర్మిరెడ్డి రఘు, లాలం సురేష్, నియోజకవర్గంలో నాలుగు మండలాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బదిలీలు, పదోన్నతులలో సందేహాలను తొలగించాలి

**ఏపీటీఎఫ్ జిల్లా నేతలు**




**నంద్యాల, మే 12 (జనస్వరం) :** నంద్యాల జిల్లా కార్యాలయంలో ఏపీటీఎఫ్ (ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్) ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి. శివయ్య, జిల్లా అధ్యక్షుడు ఎం.రామచంద్ర రెడ్డి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో నెలకొన్న అనేక సందేహాలను అధికారులు తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ఒకే గ్రామంలోని పాఠశాలలను విలీనం చేసి మోడల్ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేయాలని సూచించారు. గతంలో ఉన్నత పాఠశాలలో ఆరు సంవత్సరాల పాటు పనిచేసిన ఉపాధ్యాయులు 2023లో జరిగిన బదిలీల సందర్భంగా మాథ్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల 3, 4, 5 తరగతులు కలపడం వల్ల ఉపాధ్యాయుల పోస్టుల సంఖ్య పెరిగిందని, దీనివల్ల చాలామంది ఉపాధ్యాయులు బదిలీల్లో కోరుకున్న స్కూళ్లకు వెళ్లలేకపోయారని తెలిపారు. మోడల్ ప్రైమరీ పాఠశాలకు కేటాయించిన పిఎస్ హెచ్‌ఎం పోస్టులను ఏ విధంగా భర్తీ చేస్తారన్న విషయం స్పష్టత లేకపోవడం వల్ల ఉపాధ్యాయులు అసమాధానంగా ఉన్నారని పేర్కొన్నారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో సీనియార్టీ జాబితాలు మరియు ఖాళీల జాబితాలను స్పష్టమైన ఆదేశాలతో విడుదల చేయాలని, రోజుకో విధానం అనుసరించడం వల్ల ఏర్పడుతున్న గందరగోళ పరిస్థితిని నివారించాల్సిందిగా కోరారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలో 120 మంది విద్యార్థులకు కనీసం ఒక హెచ్‌ఎం మరియు ఐదుగురు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ఉపాధ్యాయుల హక్కులను కాపాడేందుకు, సమస్యలను పరిష్కరించేందుకు ఏపీటీఎఫ్ అన్ని విధాలుగా పోరాటం చేస్తుందని నేతలు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా సబ్ కమిటీ సభ్యులు జాకీర్ హుస్సేన్, ఇద్రుస్ భాష, వెంకటరామిరెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)కు ఘనస్వాగతం

**తిరువూరులో కార్ల ర్యాలీ, అష్టలక్ష్మీ దేవాలయంలో ప్రత్యేక పూజలు**



**తిరువూరు, మే 12 (జనస్వరం) :** పట్టణంలో సోమవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)కు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. కల్లూరు క్రాస్ రోడ్ వద్ద ప్రారంభమైన కార్ల ర్యాలీ తిరువూరు వరకు భారీ ఊరేగింపుగా సాగింది. ఎక్కడికక్కడ పార్టీ జెండాలు, నినాదాలతో ప్రాంతం ఉత్సాహభరితంగా మారింది. తిరువూరు డివిజన్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఎంపీ కేశినేని, ముందుగా తిరువూరు అష్టలక్ష్మీ దేవాలయంలో అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరిపై అమ్మవారి అనుగ్రహం కొనసాగాలని ఆకాంక్షించారు. తరువాత కలెక్టర్ లక్ష్మీశా ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించిన ప్రజా సమస్యల వేదిక సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని కనకా రెసిడెన్సీలో జరిగిన టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమాల్లో తిరువూరు టౌన్ టీడీపీ అధ్యక్షుడు బొమ్మసాని ఉమమహేశ్వరరావు, ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రోడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్తు, తిరువూరు మండల పార్టీ అధ్యక్షుడు వెదురు వెంకట నరసిరెడ్డి, గంపలగూడెం మండల పార్టీ అధ్యక్షుడు రెగళ్ల వీరారెడ్డి, ఎ.కొండూరు మండల అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి, ఎన్.టి.ఆర్ జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ అలవాల రమేష్ రెడ్డి, ఎన్.టి.ఆర్ జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి మాదల హరికృష్ణ, గంపలగూడెం యువత అధ్యక్షుడు మానికొండ రామకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు (బద్దె), సూరపనేని జయసింహ, సుంకర కృష్ణమోహన్, తాళ్లూరి రామారావు, పుల్లయ్య చౌదరి, మాజీ ఎంపీపీ గద్దె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## తిరువూరు అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం

- ఎమఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- పరిశ్రమల ఏర్పాటుకు కలెక్టర్ లక్ష్మీశాతో కలిసి చొరవ



**తిరువూరు, మే 12 (జనస్వరం) :** ప్రజల అభ్యున్నతికీ, తిరువూరు నియోజకవర్గ అభివృద్ధికీ సమిష్టిగా కృషి చేద్దామని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పిలుపునిచ్చారు. సోమవారం తిరువూరులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో కలెక్టర్ లక్ష్మీశా ఆధ్వర్యంలో నిర్వహించిన తిరువూరు డివిజన్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రోడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్తు, ఆర్డీవో కె. మాధురి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, "తిరువూరు ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి విజయవాడ వరకూ వెళ్లాల్సిన అవసరం లేకుండా, స్థానికంగానే పబ్లిక్ గ్రీవెన్స్ ఏర్పాటు చేశాం. దీనికి సహకరించిన జిల్లా అధికారులకు ధన్యవాదాలు," అని తెలిపారు.

**278 ఫిర్యాదులు స్వీకరణ :**
పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో మొత్తం 278 ఫిర్యాదులు స్వీకరించగా, వాటిలో 104 ఫిర్యాదులు రెవెన్యూ విభాగానికి చెందినవని ఎంపీ వివరించారు. వీటిని త్వరితగతిన పరిష్కరించేందుకు ఆర్డీవో మాధురిని ఆదేశించారు. మండల స్థాయిలో ఉన్న సమస్యలను కూడా త్వరగా పరిష్కరించేలా కలెక్టర్ లక్ష్మీశాను కోరారు.

**పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి :**
తిరువూరు నియోజకవర్గం ఎన్టీఆర్ జిల్లాలో ఒక ప్రత్యేకమైన, మారుమూల నియోజకవర్గమని ఎంపీ కేశినేని పేర్కొన్నారు. "ఇక్కడ అధికంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు నివసిస్తున్నారు. వారి ఉపాధి అవకాశాలను పెంచేందుకు పరిశ్రమలు తీసుకురావాలి. లెదర్ పరిశ్రమ స్థాపన కోసం 150 ఎకరాల స్థలం చూపించాల్సిన విషయమై అధికారులు జాప్యం చేస్తున్నారు," అని అభిప్రాయపడ్డారు. నందిగామ, జగయ్యపేట నియోజకవర్గాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఇప్పటికే 2 వేల ఎకరాల భూమిని ఎంపిక చేసినట్లు గుర్తు చేశారు. తిరువూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రజల సమస్యల పరిష్కారంపై మరింత దృష్టి సారించి ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

## కార్యకర్తల కష్టమే పార్టీ గెలుపు కారణం

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- తిరువూరులో టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం
- పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు



**తిరువూరు, మే 12 (జనస్వరం) :** టీడీపీకి బలం, బలగం కార్యకర్తలేనని, వారి అచంచలమైన కృషి వల్లే పార్టీ ఘనవిజయం సాధించిందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. సోమవారం తిరువూరు పట్టణంలోని కనకా రెసిడెన్సీలో జరిగిన టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్ జన్మదినం సందర్భంగా బర్త్‌డే కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్యకర్తలతో మమేకమై వారి అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకున్నారు.

**చంద్రబాబును ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుదాం :**
ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, "సీఎం చంద్రబాబు 75 ఏళ్ల వయసులోనూ నవ యువ కుడిలా కష్టపడుతున్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని కార్యకర్తలందరూ నియోజకవర్గ అభివృద్ధి కోసం, పార్టీ బలోపేతానికి కృషి చేయాలి," అని పిలుపునిచ్చారు. తిరువూరు నియోజకవర్గంలోని ప్రతి మండలానికి వారానికి ఒకరోజు తప్పకుండా వచ్చే విధంగా కార్యాచరణను రూపొందిస్తున్నట్లు తెలి పారు. "ఎమ్మెల్యే కొలికపూడితో పాటు మీకు ఎప్పుడైనా అండగా ఉంటాను," అని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

**రాష్ట్రాభివృద్ధికి పట్టుదలతో :**
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు, ఎంపీ కేశినేని శివనాథ్ మార్గదర్శనంలో పని చేస్తాను. కార్యకర్తలకు పూర్తి మద్దతుగా నిలిచి, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాను," అని స్పష్టం చేశారు.

**భారీగా హాజరైన కార్యకర్తలు :**
ఈ కార్యక్రమంలో తిరువూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు బొమ్మసాని ఉమామహేశ్వరరావు, నియోజకవర్గ ఆబ్జర్వర్ సుఖవాసి శ్రీనివాసరావు, ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రోడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్తు, అనేకమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# గందరగోళంలో పాఠశాల విద్య



### ప్రభుత్వం సరిదిద్దాల్సిన అవసరం : ఎస్టీయూ

**నంద్యాల మే 12 (జనస్వరం) :** ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.మౌలాలి ఎం.ఆజాం బేగ్ మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాల విద్యలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వాలు సంస్కరణల పేరుతో పాఠశాల విద్యను అడ్డగోలుగా విభజించి చిన్నాభిన్నం చేస్తున్నాయని, దీని వల్ల ప్రభుత్వ పాఠశాలల మనగడ ప్రశ్నార్థకంగా మారిపోతుందని తమ అసంతృప్తిని తెలియపరిచారు. 117 జీఓ రద్దు పేరుతో ప్రభుత్వం పాఠశాల వ్యవస్థను తొమ్మిది రకాల పాఠశాలల పేరుతో ఏర్పాటు చేసి గందరగోళ పరిస్థితులు సృష్టిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్ప్లస్ పేరుతో పాఠశాల సహాయకులను ప్రాథమిక పాఠశాలలకు కేటాయించకుండా ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని తగ్గించి ఉన్నత పాఠశాలలోనే కొనసాగేలా చేయాలని తద్వారా సెకండరీ గ్రేడ్ టీచర్లను ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్‌గా నియమించి వారికి న్యాయం జరిగేలా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు సుబ్బారాయుడు జిల్లా సహాధ్యక్షులు నరసింహారావు, కార్యాలయ ఇంచార్జ్ ఎల్ సుబ్బయ్య, దొర్నిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, సంఘ నాయకులు ప్రభాకర్, సుబ్బయ్య, వెంకటేశ్వరరావు, వేణు గోపాల్ శ్రీరాములు ఎయిడెడ్ వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత పార్టీ కార్యకర్తలపై



**ఆమడగూరు, మే 12 (జనస్వరం) :** కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత టీడీపీ కార్యకర్తలపై ఉందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. ఆమడగూరు టీడీపీ కమిటీ ఎంపికపై కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఈ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. టీడీపీ ఎన్నికల కమిటీకి ఎన్నికైన నూతన సభ్యులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేందుకు శక్తి ప్రయత్నాలు చేయాలని పిలుపునిచ్చారు. మున్ముందు, "పార్టీకి పనిచేయని వారిని కమిటీలో దూరం పెడతాం" అని హెచ్చరించారు. కూటమి అభ్యర్థుల గెలుపుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా టీడీపీ కార్యకర్తలు పనిచేయాలని వారు సూచించారు. టీడీపీ కార్యకర్తలకు చెందిన సభ్యత్వం ఉంటే ప్రమాదంలో మరణిస్తే 5 లక్షల వరకు ప్రమాద భీమా సౌకర్యం కూడా అందిస్తామని తెలిపారు. పార్టీలో పదవులు కావాలన్నా, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలన్నా సభ్యత్వం తప్పనిసరి అని గుర్తు చేశారు. పార్టీకి పనిచేసిన వారికి భవిష్యత్తులో తగిన గుర్తింపు ఇస్తామన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆమడ టీడీపీ మండల కన్వీనర్లు గోపాల్ రెడ్డి, జయ చంద్ర, వలిపి శ్రీనివాసులు, రాష్ట్ర డైరెక్టర్ కాలే నాయక్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కృష్ణమూర్తి, ఎల్ఐసి నరసింహులు, వల్లేపు సోమశేఖర్, టీడీపీ సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, రాజారెడ్డి, గాయత్రి, గోవిందు, శంకర్ నాయుడు, నాగేంద్ర, భాస్కర్, రమణ, నంజప్ప, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీపీఎస్సీ స్కాంలో గౌతమ్ సవాంగ్ హస్తం

### నీలాయపాలెం విజయ్ కుమార్ ఆరోపణలు



**మంగళగిరి, మే 12 (జనస్వరం) :** ఏపీపీఎస్సీ స్కాంలో ఆర్. గౌతమ్ సవాంగ్ పాత్రపై వివిధ ఆరోపణలు వేయబడుతున్నాయి. బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్ సోమవారం మంగళగిరిలో జరిగిన విలేఖరుల సమావేశంలో గౌతమ్ సవాంగ్ పట్ల తీవ్ర విమర్శలు చేశారు. ఆయన పేర్కొన్నట్లు, గౌతమ్ సవాంగ్, అప్పటి ఏపీపీఎస్సీ చైర్మన్, తాడేపల్లి పెద్దలతో కలిసి ఈ అవినీతికి పాల్పడినట్లు తెలుస్తోంది. విజయ్ కుమార్ ప్రకారం, గౌతమ్ సవాంగ్ వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని, నిర్దోషిగా ఉంటే ఎందుకు పారిపోయాడో ప్రశ్నించారు. ఆయనపై అనేక ఆరోపణలు ఉన్నాయని, అవినీతికి సంబంధించి పీఎస్ఆర్ ఆంజనేయులుపై కేసులు పెట్టినట్లు తెలిపారు. అంతేకాదు, ఆయన మరిన్ని వివరాలను వెల్లడించారు. 2018లో టీడీపీ ప్రభుత్వం ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత, వైసీపీ ప్రభుత్వం పరీక్షలు నిర్వహించినప్పటికీ, పరీక్ష పత్రాల మూల్యాంకనం న్యాయసంగతంగా జరగలేదని చెప్పారు. పేపర్లను పత్రికలు దిద్దేందుకు అనర్హులైన వ్యక్తులకు కాంట్రాక్ట్ ఇచ్చారని, పేపర్ల దిద్దవలసిన వ్యక్తులు స్వయంగా విధులు నిర్వహించకపోవడం అన్యాయమని వాదించారు. ఇక, గౌతమ్ సవాంగ్ తన పదవిని స్వయంగా వదిలి పారిపోవడంపై విజయ్ కుమార్ ఆక్షేపించారు. ఆయన రాజకీయ వర్గాలతో కలిసి పేపర్ల దిద్దనికి అనుమతులు ఇవ్వడమే కాకుండా, కోర్టు తీర్పులు కూడా నిర్లక్ష్యంగా ఉంచారని ఆరోపించారు. "గౌతమ్ సవాంగ్, పీఎస్ఆర్ ఆంజనేయులు అనేక అకృత్యాలకు పాల్పడ్డారు. వీరికి శిక్షలు తప్పవు" అని విజయ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ సమయంలో, గౌతమ్ సవాంగ్, పీఎస్ఆర్ ఆంజనేయులు, ఇతర సంబంధిత వ్యక్తులపై రాజకీయ నాయకత్వం, న్యాయవాదులు, ప్రజలు మరింత విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. "ఆవిష్కరణకు ముందు, గౌతమ్ సవాంగ్ ఎందుకు రాజీనామా చేసి పారిపోయారు? గోల్‌మాల్ లో ఆయన పాత్ర ఏమిటి?" అని ప్రశ్నించారు.

## పరోక్షాసేవగా.. శ్రీశైలభ్రామరికి లక్షకుంకుమార్చనపూజలు

### పౌర్ణమి పురస్కరించుకుని స్వామి అమ్మవార్లకు పల్లకి ఉత్సవం,ఊయల సేవ



**శ్రీశైలం మే 12 (జనస్వరం) :** శ్రీశైలభ్రమరాంభమల్లికార్జున స్వామివార్ల సన్నిదానంలో పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవారికి లక్షకుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ లక్షకుంకుమార్చనలోకార్యనిర్వాహణాధికారి యం. శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. భక్తులు పరోక్షసేవగా పాల్గొనే అవకాశం దేవస్థానం కల్పించింది. లక్షకుంకుమార్చన పూజలో శనివారం 26 మంది భక్తులు జరిపించుకున్నారని కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ పరోక్షాసేవను తెలుగు రాష్ట్రాల నుండియేగాక కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రల నుండి భక్తులు ఈ సేవను జరిపించుకున్నారన్నారు. ఈ లక్షకుంకుమార్చన పూజలో ముందుగా అర్చక వేదపండితులు మహాగణపతి పూజను నిర్వహించి అనంతరం లక్షకుంకుమార్చన జరిపిం చారు. మంగళ కరమైన ద్రవ్యాలలో కుంకుమకు ఎంతో ప్రాధాన్యతఉంది ఈ కుంకుమద్రవ్యంతో అమ్మవారిని అర్పించడం విశేష ఫలదాయకమని పండితులు పేర్కొన్నారు. లక్షకుంకుమార్చన పరోక్షాసేవకు భక్తులు ఆన్ లైన్ ద్వారా రూ.1,116లను సేవా రుసుముగా చెల్లించాల్సి ఉంటుంది. భక్తులు సేవా రుసుమును www.srisailadevasthanam.org లేదా aptemples.ap.gov.in ద్వారా చెల్లించవచ్చని కార్యనిర్వహణాధికారి తెలిపారు. ఇతర వివరాలకు దేవస్థానం సమాచారకేంద్ర ఫోన్ నంబర్లను 8333901351/52/53లను సంప్రదించవచ్చును. అదేవిధంగా పౌర్ణమిని పురస్కరించు కుని స్వామివార్లకు ఊయల సేవోత్సవం, పల్లకి ఉత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

## పోలవరం నిర్మాణం పూర్తి అయితే, ఏపీకి స్వర్ణయుగం



**ఓడి చెరువు, మే 12 (జనస్వరం) :** పోలవరం నిర్మాణం పూర్తి అయితే ఆంధ్రప్రదేశ్‌కు స్వర్ణయుగం వస్తుందని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. ఓడి చెరువు మండల కేంద్రంలోని ఐటీఐలో టిడిపి కార్యకర్తలతో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో కలిసి ఆయన మాట్లాడారు. "ఏపీ అభివృద్ధి దిశగా చంద్రబాబు నాయుడు పాలన ఆధ్వర్యంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి" అని ఆయన కొనియాడారు. కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. "టిడిపి బలపడటానికి, క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేస్తే, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించవచ్చు. ముఖ్యంగా ఎంపీటీసీ, సర్పంచ్, జడ్పీటిసి స్థానాలను గెలవాలంటే కార్యకర్తలు పార్టీ కోసం కష్టపడి పనిచేయాలి" అని ఎంఎల్ఏ పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను పోషించాలి. "కరువు, వ్యాధి, ఇతర రకాలు ఉన్నప్పటికీ, ప్రతి ఒక్కరు చిత్తశుద్ధితో కలిసి పనిచేయాలని" ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓడి చెరువు మండల టీడీపీ నాయకులు మాజీ జెడ్పీటిసి పిట్టా ఓబుల్ రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, సర్పంచ్ శంకర్ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు అంజినప్ప, పీట్ల సుధాకర్, జాకీర్, షపి, బోరు రమణ, ఓబులరెడ్డి, మాజీ కన్వీనర్ రాజారెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు రామాంజినేయులు, నిజాం, గంగాధర్, బాలు, శివారెడ్డి, మహిళా నాయకురాలు సుభాషిణి, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు



**మంగళగిరి, మే 12 (జనస్వరం) :** టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్లా శ్రీనివాసరావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపేందుకు కేక్ కట్ చేశారు. 2024 ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 95,235 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందిన పల్లా శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక మెజారిటీ సాధించిన ఎమ్మెల్యేగా గుర్తింపు పొందారు. ప్రత్యేకంగా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం, ఆయనను "పీపుల్స్ లీడర్"గా స్థాపించింది. ఈ సందర్భంగా, రాష్ట్ర అధ్యక్షుడిగా నారా చంద్రబాబు నాయుడు ఆశయాలను, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేయడంలో పల్లా శ్రీనివాసరావు కృషి మహత్యం అని ఉద్ఘాటించబడింది. టీడీపీ కుటుంబ సభ్యులు ఆయనకు ఆరోగ్యంగా, దీర్ఘాయుష్మంతంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర గ్రంధాలయ చైర్మన్ కల్లం సాంబిరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు ఏవిరమణ, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కోడూరు అఖిల్, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు దారు నాయక్, టీడీపీ అధికార ప్రతినిధి పాతర్ల రమేష్, ఇతర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం పల్లా శ్రీనివాసరావు నాయకత్వం కింద ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ మరింత బలపడిపోవడంతో పాటు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా కృషి చేస్తుందని పేర్కొన్నారు.

## యనమల రామకృష్ణుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా



**ప్రత్తిపాడు, మే 12 (జనస్వరం) :** సీనియర్ టీడీపీ నాయకులు యనమల రామకృష్ణుడు వందేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆయన జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆకాంక్షించారు. రాష్ట్ర టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఆర్థిక, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ నియోజకవర్గ టీడీపీ శ్రేణులతో కలిసి తేటగుంటలో గల యనమల గెస్ట్ హౌస్‌లో యనమలను కలుసుకొని పుష్పగుచ్చం అందించి, శాలువా కప్పి ఘన సన్మానం చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ రాజా మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుండి ఒకే పార్టీలో ఉంటూ రాష్ట్ర స్థాయి నాయకుడిగా గుర్తింపు తెచ్చుకుని జనం మెచ్చిన నాయకుడిగా యనమల రామకృష్ణుడు పేరొందారని కొనియాడారు. యనమల 42 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో వివిధ పదవులు, హోదాల్లో కొనసాగడం జరిగిందని, తుని నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశారని, రాష్ట్రానికి యనమల మరిన్ని సేవలు అందించాలని మనసారా కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట రాష్ట్ర టీఎస్టీయూసీ ఉపాధ్యక్షులు, నియోజకవర్గ టీడీపీ సీనియర్ నేత వెన్నా ఈశ్వరుడు (శివ), సీబీఎన్ ఆర్మీ కో ఆర్డినేటర్ యాళ్ల జగదీష్, లంపకలోవ సొసైటీ మాజీ అధ్యక్షులు గొంతిన సురేష్, ప్రత్తిపాడు సీహెచ్సీ అభివృద్ధి కమిటీ సభ్యులు వెలుగుల నాని, నాయకులు కొమ్ముల కన్నబాబు, అంబటి రాంబాబు, సాధనాల లక్ష్మీబాబు, బస్సా ప్రసాద్, అమరాది వెంకటరావు, బద్ది రామారావు, కొప్పన నాని అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జైలుకు పోయేంతవరకు బెయిల్ రాదు కాకాణి

### బొబ్బేపల్లి సురేష్ నాయుడు



**నెల్లూరు, మే 12 (జనస్వరం) :** "అవినీతి చేసినవారికి కూటమి ప్రభుత్వం ఎవరినీ వదిలిపెట్టదు" అని జనసేన పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గం జనసేన కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన బొబ్బేపల్లి సురేష్ నాయుడు, నెల్లూరు జిల్లా వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాని గోవర్ధన్ రెడ్డి పై తీవ్ర విమర్శలు చేశారు. "అనుమతులు లేని వరదాపురం మైనింగ్ స్కాంలో 255 కోట్లు అవినీతి చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న కాకాని గోవర్ధన్ రెడ్డి రెండు నెలలుగా అంతుచిక్కని పరిస్థితుల్లో ఉన్నారు. ఈ కేసులో ఆయన దొంగలకు, ఇంటర్నేషనల్ మాఫియా లీడర్లతో సమానంగా మరింత కష్టాలను ఎదుర్కొంటున్నారు" అని సురేష్ నాయుడు అన్నారు. "నేడు ఒక అవినీతి కేసులో జేబులు కొట్టేసే దొంగల నుండి ఇంటర్నేషనల్ మాఫియా లీడర్ల దాకా కేసులు ఎదుర్కొంటున్నాం. కానీ కాకాని గోవర్ధన్ రెడ్డి, తన పరిస్థితిని ఎలా అర్థం చేసుకోవాలో తెలియక, పోలీసులకు కూడా చెప్పకుండా బెయిల్ కోసం కోర్టులో పాకలాడుతున్నాడు" అని విమర్శించారు. "మీరు చేసిన 255 కోట్లు ప్రజల సొమ్ము. ఈ సొమ్ము కోటమి ప్రభుత్వానికి అప్పజెప్పి లొంగిపోతే, మీరు క్షమాభిక్ష పొందవచ్చు. మీరు ప్రజల సొమ్ముతో కరోనా ప్యాలెస్ కట్టుకుని, మూత వేసి పక్క రాష్ట్రాలలో తలదాచుకుని బతకడం ఎటువంటి జీవితమూ కాదు!" అని అన్నారు. "కూటమి ప్రభుత్వం ఈ అవినీతి ప్రవర్తనను ఊరుకోదు. మీరు చేసిన అవినీతి క్రమశిక్షణకు లోనై, మీకు జైలులో చోటు దొరకనంతవరకు కూటమి ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుంటుంది" అని హెచ్చరించారు. "మీరు సర్వేపల్లి నియోజకవర్గంలో చేసిన అవినీతి అక్రమాలు మొత్తం ఆధారాలతో సహా స్వాధీనపరచి, ప్రజల ముందు తీసుకురావాల్సిన అవసరం ఉంది" అని సురేష్ నాయుడు స్పష్టం చేశారు. "ఇవి ప్రజల పాపాలు కావడం వల్లే ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారు" అని సురేష్ నాయుడు పేర్కొన్నారు.

## మల్లన్న సన్నిధిలో.. ఆధ్యాత్మికం కోసం గిరిప్రదీక్షణలు



**శ్రీశైలం, మే 12 (జనస్వరం) :** జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీ భ్రమరాంభసమేత మల్లికార్జునస్వామి వార్ల సన్నిధిలో సోమవారం సాయంత్రం స్వామి వార్ల మహా మంగళహారతి పూజల అనంతరం గిరిప్రదీక్షణ కార్యక్రమం నిర్వహించారు. వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో అధిష్టింపజేసి విశేష పూజలు అనంతరం ఆలయప్రదీక్షణా నంతరం కృష్ణరాయగోపురం నుండి ప్రారంభమైన గిరిప్రదీక్షణ గంగాధరమండపం, అంకాళమ్మ ఆలయం, నందిమండపం, గంగాసదన్ మీదుగా బయలువీర భద్ర స్వామి ఆలయం, అలంకారేశ్వరస్వామి ఆలయం మీదుగా వలయారహదారి గుండా సారంగధర మఠం, హేమారెడ్డి మల్లమ్మ ఆలయం, మహిషాసుర మర్ధిని, రుద్రాక్ష మఠం, విభూది మఠం మీదుగా రుద్రవనం చేరుకుని రుద్రవనం నుండి నందిమండపం చేరుకోవడంతో గిరిప్రదీక్షణ ముగిసింది. శ్రీశైలక్షేత్రంలోని ప్రాచీన మఠం ములను, ఆలయాలను భక్తులచేత దర్శింపజేయిస్తూ వారిలో భక్తి భావాలను మరింతగా పెంపొందింపజేయాలని, అదేవిధం గా క్షేత్రాన్ని ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దడంలో భాగంగా ఈ గిరిప్రదీక్షణలు నిర్వహించడం జరుగుతుం దని ఆలయ అర్చకులు, వేదపండితులు తెలిపారు. గిరిప్రదీక్షణలో పాల్గొన్న భక్తులకు శ్రీభ్రమరాంభ మల్లికార్జున స్వామివార్ల దర్శన భాగ్యాన్ని కల్పించారు.

## వచ్చేది మన ప్రభుత్వమే సమష్టిగా పని చేద్దాం

### పార్లమెంటు పరిశీలకులు ముదునూరి



**ప్రత్తిపాడు, మే 12 (జనస్వరం) :** సీఎంగా జగన్ రెడ్డిని గెలిపించేంత వరకు సమిష్టిగా కలిసి పని చేద్దామని నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళి కృష్ణంరాజు అన్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి, తాడేపల్లిగూడెం వైసీపీ ఇంచార్జ్ కొట్టు సత్యనారాయణ నివాసంలో నరసాపురం పార్లమెంట్ పార్టీ పరిశీలకులు ముదునూరి మురళీ కృష్ణంరాజు భేటి అయ్యారు. కొట్టు సత్యనారాయణ అధ్యక్షతన నియోజకవర్గ పరిధిలో ముఖ్య నాయకులతో ముదునూరి సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో వైసీపీ ప్రభుత్వం అధికారం చేపడుతుందని, ఈ నియోజకవర్గంలో కొట్టు సత్యనారాయణ నాయకత్వంలో, నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఇచ్చిన హామీలన్నీ గాలికి వదిలి, కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని మురళి రాజు పేర్కొన్నారు. గ్రామస్థాయి నుండి నియోజకవర్గ స్థాయి నాయకులందరూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా వారి పక్షాన పోరాడాలని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు నిరంతరాయంగా పారదర్శకంగా అమలు అవ్వాలంటే ఒక్క వైసీపీ ప్రభుత్వం, జగన్మోహన్రెడ్డి వల్లే సాధ్యపడుతుందని తెలిపారు. పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మురళి రాజు కోరారు. పార్టీ కోసం ప్రజల కోసం కష్టపడి పని చేసే ప్రతి నాయకుల, కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా పార్టీ అధినేత జగన్ 2.0 పరిపాలన ఉంటుందని తెలియజేశారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను, నాయకులను గుర్తించి రివిజినల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు, ముఖ్య నాయకుల సూచనలతో రాష్ట్ర పార్టీకి తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన వీరులకు కృతజ్ఞతగా ప్రత్యేక పూజలు

### రైల్వే కోడూరు నియోజకవర్గం నుండి పలముదిర్ చోళయ్ దేవాలయానికి శ్రద్ధాంజలి యాత్ర





**మధురై, మే 12 (జనస్వరం) :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సూచనల మేరకు, భారత్‌పై పాకిస్తాన్ జరుపుతున్న యుద్ధ దాడిని ఎదుర్కొంటున్న ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో, దేశ రక్షణలో పాల్గొంటున్న మన సైనికులకు దైవబలం కలగాలని, వీరమరణం పొందిన జవాన్ల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు శ్రద్ధాంజలి యాత్ర నిర్వహించారు. ఈ యాత్ర భాగంగా, రైల్వే కోడూరు నియోజకవర్గం నుండి శాసనసభ్యులు అరవ శ్రీధర్ ఆధ్వర్యంలో, రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర పర్యవేక్షణలో సుమారు 100 మంది కార్యకర్తలు తమిళనాడు రాష్ట్రం మధురై జిల్లాలోని ప్రసిద్ధ పలమదిర్ చోళయ్ దేవాలయానికి రోడ్డు మార్గంలో బస్సులు, కారుల్లో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జోగినేని మణి, గడేకుల రమణ, పగడాల చంద్రశేఖర్, పగడాల వెంకటేష్, ఆలం రమేష్, మదాసు నరసింహ, గొబ్బురు హరి, పసుపులేటి వెంకట రమణ, కటికం మణి, సూర్యాల ధర్మయ్య, తాతంశెట్టి నరసింహ ప్రసాద్, రామ్ సిద్దు, గోపి, శేషు, సువ్వారపు హరిప్రసాద్, సాదు కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా దేశ భక్తిని, సైనికుల పట్ల గౌరవాన్ని ప్రజల్లో పెంపొందించే దిశగా జనసేన పార్టీ చైతన్యం నింపుతోంది. దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన వీరులకు కృతజ్ఞతగా పూజలు నిర్వహించడం ప్రశంసనీయమని నాయకులు అభిప్రాయపడ్డారు.

## టీడీపీని మరింత బలోపేతం చేద్దాం

**- మండలంలో పార్టీ కార్యక్రమాల నిర్వహణలో మిల్లు బాబు సేవలు అభినందనీయం**

**- ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్**



**దెందులూరు, మే 12 (జనస్వరం) :** టీడీపీని మరింత బలోపేతం చేద్దామని మండలంలో పార్టీ కార్యక్రమాల నిర్వహణలో మిల్లు బాబు సేవలు అభినందనీయమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ రావు అన్నారు. మండల టీడీపీ అధ్యక్షులుగా మూడోసారి మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు)ను ఎంపిక చేశారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం మిల్లు బాబును పూలమాలతో సత్కరించి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇన్చార్జీలు, గ్రామ పార్టీల అధ్యక్షులు పాల్గొన్నారు.